

**అసమానతలకు ముగింపు పలకాలి**


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్ Cell:9701249103




సంపుటి - 3 సంచిక -87 గురువారం 3 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Districts


# కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం

## సిఎం రేవంత్ పాలనపై నిప్పులు కక్కిన కెటిఆర్







**ఎటు చూసినా విధ్వంసం, వికృతం**

**జలద్రోహం చేస్తున్న జలగల పాలన**

**అతిపెద్ద మోసం కాంగ్రెస్ మేనిఫెస్టో**

**భూములు నిషేధిత జాబితాలో పెట్టి 30శాతం కమిషన్లు**

**వెయ్యిరోజుల్లో 4.50లక్షల కోట్ల అప్పులు**

**కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యిరోజుల పాలనపై బిఆర్ఎస్ ఛార్జ్‌షీట్**

**హైదరాబాద్ ,సెప్టెంబర్ 2.(జర్నలిస్ట్ వార్త)**
కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల చేసింది. బుధవారం రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి 1000 రోజుల దగా పాలనపై హరీశ్ రావుతో కలిసి తెలంగాణ భవన్‌లో షార్జిషీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ఎటు చూసినా విధ్వంసం, వికృతం. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన కాదు.. ఇది పీడన. జలద్రోహం చేస్తున్న జలగల పాలన. ఈ శతాబ్దపు అతిపెద్ద మోసం కాంగ్రెస్ మేనిఫెస్టో. పేదల భూములు నిషేధిత జాబితాలో పెట్టి 30శాతం కమిషన్లు తీసుకుంటున్నారు. అభివృద్ధి పనులు చేయకున్నా.. రాష్ట్ర ప్రభుత్వం 4.50లక్షల కోట్ల అప్పులు చేసింది. కాంగ్రెస్ అసమర్థత ప్రొ మ్యాక్స్, అవినీతి అల్ట్రామ్యాక్స్, అరాచకం ఐమ్యాక్స్ అంటూ విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరిలా తయారుచేసింది. రూ.50వేల కోట్లు రుణమాఫీ చేస్తామని.. రూ.20వేల కోట్లు చేశారు. రుణమాఫీ చేస్తామని.. **మిగతా 2లో...**

# జనసేనకు 'జై కొట్టు'

## జనసేన యువజన విభాగానికి 'జై కొట్టు'గా నామకరణం




**జనసేన యువజన విభాగానికి 'జై కొట్టు'గా నామకరణం**

**పిఠాపురంలో లోగోను ఆవిష్కరించిన మంత్రి నాదెండ్ల మనోహర్**

**ఆడియో సందేశం ద్వారా శుభాకాంక్షలు తెలిపిన పవన్ కల్యాణ్**

**నిరంకుశ జగన్‌ను ఓడించడంలో జనసేనది కీలకపాత్రన్న నాదెండ్ల**

**పవన్ జన్మదిన వేడుకలతో కలిసి ఘనంగా జరిగిన కార్యక్రమం**



**పిఠాపురం ,సెప్టెంబర్ 2.(జర్నలిస్ట్ వార్త)**
ఏపీ డిప్యూటీ సీఎం, జనసేనాని పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా జనసేన పార్టీ యువజన విభాగాన్ని ఆవిష్కరించారు. జనసేన పార్టీ యువజన విభాగానికి 'జై కొట్టు' అని నామకరణం చేశారు. కాకినాడ జిల్లా పిఠాపురంలో బుధవారం జరిగిన ఓ భారీ కార్యక్రమంలో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ యువజన విభాగం లోగోను**మిగతా 2లో...**

## ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్ కు బీజేపీ కీలక బాధ్యతలు

**సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాలకు దక్షిణాది రాష్ట్రాల ఇన్‌ఛార్జిగా సత్యకుమార్ యాదవ్ నియామకం**

**మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను పూర్తి చేసుకున్న సందర్భంగా కార్యక్రమాలు**

**క్షేత్రస్థాయి పర్యవేక్షణ బాధ్యతలను చూడనున్న సత్యకుమార్**



**ఢిల్లీ ,సెప్టెంబర్ 2.(జర్నలిస్ట్ వార్త)**
ఏపీ వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు బీజేపీ అధిష్ఠానం కీలకమైన ప్రాధాన్యాన్ని అప్పగించింది. ప్రధానమంత్రి మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవను పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహించనున్న**మిగతా 2లో...**

## అయోధ్య రామ మందిరానికి కొత్త సీఈఓ..

**రామ మందిరానికి తొలి సీఈఓగా జీతేంద్ర మిశ్రా ఎంపిక**

**గతంలో ఎయిర్‌ఫోర్స్ వెస్ట్రన్ కమాండ్ చీఫ్‌గా బాధ్యతలు**

**మందిర భద్రతకు శాశ్వత కమిటీ ఏర్పాటు ప్రతిపాదన**

**విరాళాల అక్రమాలపై సిట్ విచారణను సమీక్షించనున్న ట్రస్ట్**



2లో.




## ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి

**రాజ్‌నాథ్‌సింగ్, రామ్మోహన్‌నాయుడితో భేటీ**

**ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 సమ్మిట్ కు రాజ్‌నాథ్ ను ఆహ్వానించిన రేవంత్**

**డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు ఉచితంగా భూమి కేటాయించాలని విన్నపం**

**రాష్ట్రంలో విమానాశ్రయాల విస్తరణపై రామ్మోహన్ తో చర్చించిన సీఎం**

**ఢిల్లీ,సెప్టెంబర్ 2.(జర్నలిస్ట్ వార్త)**
ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో వరుసగా భేటీ అయ్యారు. రాష్ట్ర అభివృద్ధి, మౌలిక సదుపాయాల **మిగతా 2లో...**

## వెయ్యి రోజుల పాలన ప్రజా రంజకం..

**ఆర్థిక లోటు ఉన్నా సంక్షేమం ఆపలేదు: పొంగులేటి**

**వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం**

**రైతు సంక్షేమానికి రూ.1.76 లక్షల కోట్లు ఖర్చు చేశామని వెల్లడి**




**హైదరాబాద్ ,సెప్టెంబర్ 2.(జర్నలిస్ట్ వార్త)**
తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... తమ ప్రజా పాలనలో సామాన్యుల కష్టాలను తీర్చడానికే నిరంతరం కృషి చేశామని అన్నారు.**మిగతా 2లో...**

## నాపై కాదు.. ముందు రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోండి

**: ఢిల్లీలో కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు!**

**ఢిల్లీలో పార్టీ అధిష్ఠానాన్ని కలిసిన కొండా సురేఖ**

**పార్టీలో బీసీ నేతలను టార్గెట్ చేస్తున్నారని విమర్శ**

**అధిష్ఠానం తనను రాజీనామా చేయాలని కోరలేదని వెల్లడి**

**ఢిల్లీ ,సెప్టెంబర్ 2.(జర్నలిస్ట్ వార్త)**
ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ మంత్రి కొండా సురేఖ... సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈరోజు కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె... తనపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని పార్టీ పెద్దలను డిమాండ్ చేశారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేస్తూ చర్యలు తీసుకోవాలనుకోవడం**మిగతా 2లో...**





## పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీరు

**ఏరియల్ వ్యూ ద్వారా పోలవరం ఎడమ కాల్వ పరిశీలన**

**జలహారతి ఇచ్చి నీరు విడుదల చేసిన చంద్రబాబు**

**అనకాపల్లి,,సెప్టెంబర్ 2.(జర్నలిస్ట్ వార్త)**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం అనకాపల్లి జిల్లాలోని పాయకరావుపేటలో పర్యటించారు. ఏరియల్ వ్యూ ద్వారా పోలవరం ఎడమ కాల్వను పరిశీలించి ఉత్తరాంధ్రకు

# మళ్లీ ఉద్రిక్తతలు



**మరింత ముదురుతున్న యుద్ధ వాతావరణం**

**అమెరికా, ఇరాన్‌ల మధ్య పరస్పర దాడులు**

**పెళ్లి వేడుకపై అమెరికా క్షిపణి దాడి**

**ఐదుగురు మృతి, 50 మందికి గాయాలు**

**ప్రతీకార దాడులకు దిగిన ఇరాన్ సైన్యం**

**ప్రతీకారం తీర్చుకుంటాం..**

**అమెరికాకు ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్!**

**టెహ్రాన్,,సెప్టెంబర్ 2.(జర్నలిస్ట్ వార్త)**
పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు మొదలయ్యాయి. అమెరికా దాడులతో మళ్లీ అనిశ్చితి ఏర్పడింది. మంగళవారం రాత్రి అమెరికా దాడులు చేయడంతో ఇరాన్ కూడా ప్రతీకార దాడులకు దిగింది. ఇందుకు సంబంధించి ఇరాన్ మీడియాలో పలు కథనాలు వెలువడ్డాయి. ఇరాక్, జోర్డాన్‌పై ఇరాన్ ప్రత్యేక **మిగతా 2లో...**

# జనసేనకు 'జై కొట్టు'





**మొదటిపేజీ తరువాయి**

ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంతో పిఠాపురం జనసేన శ్రేణుల నినాదాలతో మార్మోగిపోయింది.
ఈ సందర్భంగా వేలాది బైకులతో భారీ ర్యాలీ నిర్వహించారు. 'జై జనసేన', 'జై పవన్ కల్యాణ్' నినాదాలతో పట్టణ వీధులు దద్దరిల్లాయి. ఈ కార్యక్రమానికి జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన ఆడియో సందేశాన్ని పంపారు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యల కారణంగా పవన్ కల్యాణ్ పూర్తిస్థాయిలో సమయం కేటాయించలేకపోతున్నారని, అయినప్పటికీ ఆయన ఆలోచనలు ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమం చుట్టూనే ఉంటాయని నాదెండ్ల మనోహర్ తెలిపారు.
అనంతరం నాదెండ్ల మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో కూటమి విజయంలో జనసేన పార్టీ కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. "నిరంకుశ జగన్‌ను ఓడించి, ప్రజల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో మనమందరం సఫలమయ్యాం" అని అన్నారు. పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా యువత పార్టీని ముందుకు నడిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలకు వేదికగా నిలిచింది. నాదెండ్ల మనోహర్ కేక్ కట్ చేసి, పవన్ కల్యాణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక గీతాలు, ఎలక్ట్రిక్ వాహనాల ప్రదర్శన ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యువతను పార్టీలో మరింత క్రియాశీలం చేసే లక్ష్యంతో 'జై కొట్టు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం

**మొదటిపేజీ తరువాయి**

సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ఒట్టుపెట్టారు. మాఫీ చేయకుండానే.. 70శాతం మంది రైతులకు కుచ్చుటోపీ పెట్టారు. తెలంగాణను దేశానికే అన్నపూర్ణగా కేసీఆర్ మారిస్తే.. కాంగ్రెస్ నాశనం చేసింది. రాష్ట్రంలో దరిద్రం దండయాత్ర మొదలుపెట్టి వెయ్యి రోజులు అయింది. రాష్ట్ర సంపదను కొల్లగొట్టే విషయంలో సీఎం, మంత్రులు కొట్టుకుంటున్నారు. కాంగ్రెస్ పాలనలో ఢిల్లీకి మూటలు.. పదవుల కోసం కీచులాటలు తప్ప ఏం లేదు. రైతుబంధు బంద్ అయ్యింది.. రాహుల్ బంధు మొదలైంది. గోదావరి, కృష్ణా జలాల వాటాల్లో తెలంగాణకు అన్యాయం జరిగితే మిమ్మల్ని వదిలిపెట్టం. కాళేశ్వరం మీద కక్షకట్టి.. రైతులను శిక్షిస్తున్నారు. మిస్ వరల్డ్ పోటీలు, మెస్సీ కోసం నిధులు భారీగా ఖర్చు చేస్తారు. కానీ, రైతులకు నీళ్లు ఇచ్చేందుకు మాత్రం డబ్బులు ఖర్చు పెట్టరు. కాంగ్రెస్ వచ్చిన ఏడాదిలోనే 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. జాబ్ క్యాలెండర్ పేరిట.. జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారు. ఢిల్లీలో రాహుల్ జెన్ జీని వెంటపెట్టుకొని.. ప్రజాస్వామ్యమని కొటేషన్లు చెబుతున్నారు. తెలంగాణలో మాత్రం నిరుద్యోగులపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు సీనియర్ నేతలు సమావేశంలో పాల్గొన్నారు. ఎంగిలి విస్తరాకుల దగ్గర కుక్కలు కొట్టుకున్నట్లు.. రాష్ట్ర సంపాదన కోసం మంత్రులు, ముఖ్యమంత్రి తన్నుకున్నారు. ప్రజా పాలన కాదు వెయ్యి రోజుల శని పాలన అన్నారు. వెయ్యి రోజులుగా ప్రజలకు నరకం చూపిస్తున్నారు. ఆర్థిక, సామాజిక విధ్వంసం తప్ప చేసింది ఏమీ లేదన్నారు. ఈ శతాబ్దం అతి పెద్ద మోసం కాగ్రెంస్ మోనిఫెస్టో అని విమర్వచించరు. జల ద్రోహం చేస్తున్న జలగల పాలన అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబుకు చంచాగిరి చేస్తూ గురువుగారికి దక్షిణగా కృష్ణా, గోదావరి నీళ్లు ఇస్తున్నాడు. అందాల పోటీలకు పెట్టిన ఖర్చులో పదో వంతు ఖర్చు చేస్తే కాఫర్ డ్యాం కట్టి నీళ్లు ఇయ్యొచ్చని ఇంజిర్లు చెప్పారు. వారికి బెల్టు ట్రీట్‌మెంట్ ఉంటుందని భయపెట్టారన్నారు. ఎస్ఎల్‌బీసీ కుప్పకూల్చినా, చెక్కు డ్యాంలు కూలినా బీజేపీ, ఎన్‌డీఎస్ఏ నోరు తెరువదు. జీఆర్ఎంబీలో తెలంగాణ ప్రాజెక్టులు రద్దు చేయాలని ఎజెండా పెడితే పారిపోతున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు మోచేయి నీళ్లు తాగే అధికారి ఆదిత్య నాద్ దాస్ ను సలహాదా రుగా పెడితే తెలంగాణకు నీళ్లు ఎలా వస్తాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూములను కొల్లగొడుతున్నారు. రూ.50 వేల కోట్లతో రుణమాఫీ చేస్తామని రూ.20 కోట్లతో ముగించారని మండిపడ్డారు. నీళ్లు అడిగితే కోసి రక్తం చల్లమన్నారు. యూరియా అడిగిన రైతులపై లాఠీ చార్జి చేశారు. కాళేశ్వరంపై కక్ష రైతన్నకు శిక్ష, మోటర్లుకు మీటర్లు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు బందు అయింది. రాహుల్ బంధ్ చాలయిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగున్నర కోట్ల అప్పు చేశారు. రియల్ ఎస్టేట్ కుప్ప కూలింది. అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పుడున్నది అచ్చ కాంగ్రెస్ కాదు, పచ్చ కాంగ్రెస్ కాదు, లుచ్చ కాంగ్రెస్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణలో అసలైన కాంగ్రెస్ లేదని తెలంగాణ సమాజాం అనుకుంటుందన్నారు. మొదటి నుంచి వారికి కాకుండా మధ్యలో వచ్చిన వారికి అందలం ఎక్కించార న్నారు. పార్టీ కోసం పని చేసిన వారిని విస్మరించారన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ఈ శతాబ్దం అతి పెద్ద మోసం కాగ్రెంస్ మోనిఫెస్టో అని విమర్శించారు.

# మళ్లీ ఉద్రిక్తతలు

**మొదటిపేజీ తరువాయి**

సైనిక దళం ఐఆర్‌జీసీ దాడి చేసింది. కువైత్, బహ్రెయిన్‌లో కూడా పేలుళ్లు సంభవించాయి. సిరిక్ ప్రాంతంలో అమెరికా దాడి వల్ల ఓ పెళ్లింట విషాదం సంభవించిందని ఇరాన్ మీడియా పేర్కొంది. ఓ చిన్నారి సహా నలుగురు మృతి చెందారని, 50 మంది గాయపడ్డారని తెలిపింది. ఈ ఉదంతంపై ఇరాన్ సుప్రీం లీడర్ మండిపడ్డారు. యూఎస్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. యూఎస్‌కు తమ సైన్యం మర్చిపోలేని గుణపాఠం చెబుతుందని ఐఆర్‌జీసీ ప్రతినిధి హుస్సేన్ మొహబి పేర్కొన్నారు. ఈ దాడులు ఎందుకు చేశామా? అని చింతించేలా చేస్తామని హెచ్చరించారు. అయితే, హోర్ముజ్‌లో కమర్షియల్ నౌకలపై ఇరాన్ దాడి చేసే ప్రయత్నం చేయడంతోనే తాము దాడులు చేయాల్సి వచ్చిందని యూఎస్ సెంట్రల్ కమాండ్ తెలిపింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకూ దాడులు కొనసాగాయని పేర్కొంది. ఇక తమ భూభాగం వైపు వస్తున్న 13 బాలిస్టిక్ మిసైల్స్‌ను మార్గమధ్యంలోనే ధ్వంసం చేశామని జోర్డాన్ మిలిటరీ పేర్కొంది. మరో మూడు మిసైల్స్ నిర్మానుష్య ప్రాంతంలో కూలిపోయాయని తెలిపింది. ఇరాన్ దాడుల వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని చెప్పింది. బుధవారం ఉదయం ఇరాన్ ప్రయోగించిన పలు మిసైల్స్‌ను అడ్డుకున్నామని మరో ప్రకటనలో కువైట్ తెలిపింది. బహ్రెయిన్‌లో కూడా పేలుళ్లు సంభవించినట్టు తెలిసింది. అమెరికా దాడుల్లో చిన్నారి మరణించినట్టు ఇరాన్ మీడియాలో వార్తలు రావడంపై యూఎస్ సెంట్‌కామ్ ప్రతినిధి స్పందించారు. ఇరాన్ దళాల లాగా తాము సామాన్య పౌరులను ఏనాడు టా÷-గ్గ్÷ట్ చేయలేదని స్పష్టం చేశారు. దక్షిణ ఇరాన్‌లోని సిరిక్ కౌంటీలో ఉన్న కుహెస్తక్ నగరంలో ఘోరం జరిగింది. ఒక నివాస గృహంలో జరుగుతున్న పెళ్లి వేడుకపై అమెరికా సేనలు క్షిపణితో దాడి చేశాయి. ఈ భయంకరమైన దాడిలో ఒక చిన్నారి సహా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని, 50 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారని ఇరాన్ రెడ్ క్రెసెంట్ ప్రకటించింది. ఈ దారుణ ఘటనపై ఇరాన్ తీవ్రస్థాయిలో మండిపడింది. ఇదొక అత్యంత క్రూరమైన నేరమని అభివర్ణించింది. అమెరికా చేసిన ఈ దారుణ కాండకు కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. అమాయకులైన పౌరులపై జరుగుతున్న ఈ దాడులను చూస్తూ అంతర్జాతీయ సమాజం మౌనం వహించడం అత్యంత ప్రమాదకరమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మౌనంగా ఉన్న దేశాలు రేపు తమ వంతు వచ్చినప్పుడు తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని బఘాయి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ళ్లి జరుగుతున్న ఇల్లు అమెరికా క్షిపణి శకలాలు తగలడంతో పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలను ఇరాన్ ప్రభుత్వ మీడియా విడుదల చేసింది. ఇల్లంతా శిథిలాల మయంగా మారిన ఆ వీడియోలు అందరినీ కలచివేస్తున్నాయి. అయితే సిరిక్ కౌంటీలో ఏ లక్ష్యాన్ని ఛేదించేందుకు అమెరికా ఈ దాడి చేసిందనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. పెళ్లి వేడుకపై జరిగిన ఈ దాడికి సంబంధించి అమెరికా ప్రభుత్వం గానీ, సైన్యం గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అమాయకుల ప్రాణాలు తీసిన అమెరికాపై ఇరాన్ ఇప్పటికే ప్రతీకార దాడులు ప్రారంభించింది. జోర్డాన్, కువైట్, బహ్రెయిన్, ఇరాక్ దేశాల్లో ఉన్న అమెరికా అనుబంధ సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ బలగాలు క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడ్డాయి. హార్ముజ్ జలసంధి సమీపంలో, దక్షిణ ఇరాన్ పరిసరాల్లో భారీ పేలుళ్లు సంభవించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. కొన్ని నెలలుగా అమెరికా, ఇరాన్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొన్నాయి. ఇరు దేశాల మధ్య నెలకొన్న తాజా పరిస్థితులు పశ్చిమాసియాలో మరింత ఉద్రిక్తతలకు దారితీస్తున్నాయి. అమెరికా దాడులకు ఎట్టి పరిస్థితుల్లోనూ దీటుగా బదులిస్తామని ఇరాన్ పదేపదే హెచ్చరిస్తోంది. మరోవైపు ఇరాన్ గనక మరిన్ని దాడులకు పాల్పడితే తీవ్రమైన సైనిక చర్యలు తప్పవని వాషింగ్టన్ కౌంటర్ వార్నింగ్ ఇస్తోంది. ఈ పరిణామాలు భవిష్యత్తులో పెను యుద్ధానికి దారితీసే అవకాశాలు ఉన్నాయని అంతర్జాతీయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఆదివాసీ బిడ్డ ఉకే శిరీషాను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి.

### -సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణ.

**బయ్యారం/ ,సెప్టెంబర్ 2.(జర్నలిస్ట్ వార్త)**

ఇటీవల హైదరాబాదులో దారుణ హత్యకు గురి అయిన ఆదివాసి గిరిజన మహిళ ఉకే శిరీష కుటుంబానికి న్యాయం జరగాలని ఆమె ఆత్మకు శాంతి కలగాలని జగ్గుతండా గ్రామ పంచాయతీ సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎన్నో ఉన్నత చదువులు చదువుకొని తన పేద కుటుంబానికి ఆసరాగా నిలబడి కన్న తల్లిదండ్రుల ఆశలను నెరవేరాలనే సంకల్పంతో హైదరాబాద్ లో నర్సుగా ఉద్యోగం చేస్తున్న శిరీషను హత్య చేయడం చాలా దారుణ ఘటన అన్నారు. ఈ హత్యకు కారణమైన



నిందితులకు వెంటనే కఠినంగా శిక్షించి, శిరీష కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వట్టం సావిత్రి, కంద్రాతి యాకేష్, ఈసం పావని, మక్కల దుర్గారావు, తేజవత్ రాఘవేంద్ర, తమ్మిశెట్టి



రాందాస్, తునికిపాటి నాగేందర్, వాసం రమణయ్య, కారం ముత్తయ్య, ఆనంద్, నాగేష్, కృష్ణ, లోకేష్, సునీల్, వెంకటేష్, సిద్దు, పెద్దలు, మహిళలు చిన్నారులలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వెయ్యి రోజుల పాలన ప్రజా రంజకం..

**మొదటిపేజీ తరువాయి**

రాష్ట్రంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం, గత ప్రభుత్వ అప్పుల భారం ఉన్నప్పటికీ, ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు.
ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై మంత్రి పొంగులేటి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో కేసీఆర్ 'వరి వేస్తే ఉరే' అన్నారని, కానీ తమ ప్రభుత్వం రాగానే వరి సాగుకు మద్దతుగా రూ.500 బోనస్ అందిస్తూ, వరి ఉత్పత్తిలో తెలంగాణను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపామని గుర్తుచేశారు. రైతు సంక్షేమానికై ఇప్పటికే రూ.1.76 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 ప్రశ్నాపత్రాలను అమ్ముకున్నారని ఆరోపించారు.
గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ.8.21 లక్షల కోట్లకు పైగా అప్పులు, నిలిచిపోయిన బకాయిలు, సర్పంచ్‌ల బకాయిలతో పాటు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ నిధులను కూడా తమ ప్రభుత్వమే చెల్లిస్తోందని పేర్కొన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో పేదలకు రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే కొత్తగా 15 లక్షల రేషన్ కార్డులు మంజూరు చేసిందని తెలిపారు. అతి త్వరలోనే మరో 3 లక్షల మందికి కొత్తగా వితంతు, వృద్ధాప్య పింఛన్లు అందజేయబోతున్నామని ప్రకటించారు.

## ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్ కు బీజేపీ కీలక బాధ్యతలు

**మొదటిపేజీ తరువాయి**

'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాలకు దక్షిణాది రాష్ట్రాల ఇన్‌ఛార్జిగా ఆయనను నియమించింది. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా బీజేపీ, ఎన్డీయే కూటమి ఆధ్వర్యంలో విస్తృత ప్రజా సంక్షేమ, సేవా కార్యక్రమాలను చేపట్టనున్నారు. ప్రజాసేవ, దేశాభివృద్ధి సహా 'వికసిత్ భారత్2047' సంకల్పాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఇందులో భాగంగా 'ఆశీర్వాద్ కా దియా', 'నమో సేవా గాథ', 'ఆంగన్ కా ఉత్సవ్', 'కహానీ బద్లావ్ కి', 'సేవా జ్యోతి యాత్ర' వంటి వినూత్న ప్రజా భాగస్వామ్య సేవలను ప్రజల ముందుకు తీసుకురానున్నారు. దక్షిణాదిలోని అన్ని రాష్ట్రాల్లో ఈ కార్యక్రమాల సమన్వయం, అమలు, క్షేత్రస్థాయి పర్యవేక్షణ బాధ్యతలను మంత్రి సత్యకుమార్ దగ్గరుండి చూడనున్నారు. ఈ పర్యటనలో భాగంగా తమిళనాడులోని తిరుచిరాపల్లిలో జరగనున్న రాష్ట్రవ్యాప్త వర్క్ షాప్ కు మంత్రి సత్యకుమార్ హాజరవుతున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఈ సేవా సంకల్ప్ అభియాన్‌ను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణ, వ్యూహాలపై ఆయన అక్కడ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు.

# ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి

**మొదటిపేజీ తరువాయి**

కల్పనకు సంబంధించి పలు కీలక అంశాలపై కేంద్ర మంత్రులతో చర్చలు జరిపారు.
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026'కు రాజ్ నాథ్ సింగ్ ను ముఖ్య అతిథిగా సీఎం ఆహ్వానించారు. ఈ గ్లోబల్ సమ్మిట్‌లో భాగమైన డిఫెన్స్ ఎక్స్‌పోలో కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ భాగస్వామ్యం వహించాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు, మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర వద్ద ప్రతిపాదించిన డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు ఉచితంగా భూమి కేటాయించాలని కోరారు. ఇక ఆదిలాబాద్ విమానాశ్రయం పునరుద్ధరణ అంశాన్ని రాజ్‌నాథ్ దృష్టికి తీసుకెళుతూ.. ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటికే 750 ఎకరాల భూసేకరణ పూర్తి చేశామని, అవసరమైతే మరో 750 ఎకరాలు సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.
అనంతరం పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడితో సమావేశమైన రేవంత్ రెడ్డి... రాష్ట్రంలోని విమానాశ్రయాల విస్తరణ, అభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా ఆదిలాబాద్, వరంగల్‌లోని మామునూరు విమానాశ్రయాల పనులను వేగవంతం చేయాలని, కొత్త విమానాశ్రయాల ప్రతిపాదనలకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి వెంట మంత్రి గడ్డం వివేక్, ఎంపీలు మల్లు రవి, బలరామ్ నాయక్, అనిల్ కుమార్ యాదవ్ తదితర నేతలు ఈ భేటీలలో పాల్గొన్నారు.

## అయోధ్య రామ మందిరానికి కొత్త సీఈఓ..

### రామ మందిరానికి తొలి సీఈఓగా జీతేంద్ర మిశ్రా ఎంపిక

అయోధ్య రామ మందిరం పరిపాలనకు తొలి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జీతేంద్ర మిశ్రాను నియమించే అవకాశం ఉంది. 5 వేల మందికి పైగా దరఖాస్తుదారుల నుంచి ఆయన్ను ఎంపిక చేసినట్లు సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. భారత వైమానిక దళంలో పలు కీలక కమాండ్ బాధ్యతలు నిర్వహించిన జీతేంద్ర మిశ్రా.. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో వెస్ట్రన్ కమాండ్ చీఫ్‌గా పనిచేశారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ బుధవారం కీలక సమావేశం నిర్వహించనుంది. ఈ భేటీలో 12 అంశాలపై చర్చించనున్నారు. ఇందులో రామ మందిరానికి తొలి సీఈఓ నియామకం ప్రధాన అంశంగా ఉంది. సీఈఓకు విస్తృత పరిపాలనా అధికారాలు కల్పించేలా ట్రస్ట్ డీడ్‌లో మార్పులు చేయాలని కూడా నిర్ణయించే అవకాశం ఉంది. 2020 ఫిబ్రవరి 5న ట్రస్ట్ ఏర్పాటైన తర్వాత డీడ్‌లో మార్పులు చేయడం ఇదే తొలిసారి కానుంది. మందిరంలో విరాళాల అక్రమాల ఆరోపణలు, సమర్పణల నగదు మాయం వ్యవహారం వెలుగులోకి వచ్చిన తర్వాత ట్రస్ట్ నిర్వహిస్తున్న మూడో సమావేశం ఇది. ఈ వ్యవహారం నేపథ్యంలో ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ రాజీనామా చేశారు.
మందిరం పరిపాలనను మరింత ప్రొఫెషనల్‌గా, పారదర్శకంగా నిర్వహించేందుకు పూర్తి స్థాయి సీఈఓ అవసరమని రామ మందిర నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్రా గతంలో పేర్కొన్నారు. సీఈఓ ప్రభుత్వ జోక్యం లేకుండా పనిచేస్తారని, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శికి నివేదిస్తారని సమాచారం.
సీఈఓకు చట్టపరమైన, పరిపాలనా, ఆర్థిక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. సంస్థకు అవసరమైన విధానాలు, వ్యవస్థలు, నిర్వహణ పద్ధతులను రూపొందించడం, ట్రస్ట్ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడం, చట్టపరమైన నిబంధనలను పాటించేలా చూడటం వంటి బాధ్యతలు కూడా ఆయన పరిధిలోకి రానున్నాయి. సంస్థ భవిష్యత్ అభివృద్ధి, సమర్థవంతమైన నిర్వహణలో సీఈఓ అత్యున్నత కార్యనిర్వాహక అధికారిగా వ్యవహరించనున్నారు. మందిర భద్రత కోసం శాశ్వత స్థానిక భద్రతా సమన్వయ కమిటీ ఏర్పాటు అంశం కూడా సమావేశం అజెండాలో ఉంది. ట్రస్ట్‌కు అధికారిక మీడియా ప్రతినిధిని నియమించే అంశంపైనా చర్చించనున్నారు. విరాళాల అక్రమాల ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ పురోగతిని కూడా ట్రస్ట్ సమీక్షించనుంది.

## నాపై కాదు.. ముందు రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోండి

**మొదటిపేజీ తరువాయి**

సరికాదని సురేఖ స్పష్టం చేశారు. మహిళలు స్వతంత్రంగా జీవించాలని రాహుల్ గాంధీ ఎప్పుడూ చెబుతుంటారని అన్నారు. తన కుమార్తెను తీవ్రంగా రెచ్చగొట్టడం వల్లే ఆమె ఆ వ్యాఖ్యలు చేయాల్సి వచ్చిందని చెప్పారు. పార్టీలో బీసీలకు ఒక న్యాయం... రెడ్డి సామాజిక వర్గాలకు మరో న్యాయమా? అని ప్రశ్నించారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతలు ఎంతోమంది అనుచిత వ్యాఖ్యలు చేసినా చర్యలు తీసుకోలేదని, కేవలం బీసీలనే టార్గెట్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. పదేళ్లు తానే సీఎంగా ఉంటానని రేవంత్‌రెడ్డి సొంతంగా చెప్పుకోవడం ఎంతవరకు సమంజసం? అని సురేఖ ప్రశ్నించారు. రాష్ట్ర కేబినెట్‌లోని పలువురు మంత్రులపై అనేక ఆరోపణలు ఉన్నాయని.. రేవంత్ పాలనపై మంత్రులు, సీనియర్ నేతల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకు తనను రాజీనామా చేయమని అధిష్ఠానం కోరలేదని, జరిగిన పరిణామాలన్నింటినీ రాతపూర్వకంగా హైకమాండ్‌కు నివేదించినట్లు తెలిపారు.

## పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీరు

**మొదటిపేజీ తరువాయి** గోదావరి జలాలను విడుదల చేసి జలహారతి ఇచ్చారు. ముఖ్యమంత్రికి సంప్రదాయ కోలాటంతో స్వాగతం పలికారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి జిల్లాకు నీరు ఇస్తున్నందుకు సూచికగా పాయకరావుపేట వద్ద శిలాఫలకాన్ని సీఎం ఆవిష్కరించారు. కూటమి ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి శిలాఫలకం వద్ద సీఎం చంద్రబాబు ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, వంగలపూడి అనిత, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఎడమ కాలువ నుంచి అనకాపల్లి జిల్లా వరకూ వచ్చిన గోదావరి జలాలకు ముఖ్యమంత్రి ప్రత్యేక పూజలు చేశారు. పాయకరావుపేట వద్ద పోలవరం ఎడమ కాలువ క్రాస్ రెగ్యులేటర్ నుంచి గోదావరి జలాలను ఉత్తరాంధ్ర జిల్లాలకు విడుదల చేశారు. ఎడమ కాల్వ ద్వారా వదిలే నీటితో నాలుగు జిల్లాల పరిధిలో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు ఇచ్చేలా ఏపీ ప్రభుత్వం ప్రణాళిక రచించింది.

## చిన్నారుల మధ్య సుధాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు




**కేసముద్రం/సెప్టెంబరు 2 (జర్నలిస్ట్ వార్త);**కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని అమీనపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సామ సుధాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం పాఠశాల విద్యార్థుల మధ్య ఘనంగా నిర్వహించారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని అమీనపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు. చిన్నారులతో కొంత సమయం గడిపి వారితో ఆప్యాయంగా మాట్లాడారు.ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నారులపై తనకు ప్రత్యేకమైన ప్రేమాభిమానాలు ఉన్నాయని తెలిపారు. జన్మదిన వేడుకలను ఆర్భాటంగా కాకుండా విద్యార్థులతో కలిసి జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. చిన్నారుల ముఖాల్లో కనిపించే చిరునవ్వులే తన జన్మదినానికి లభించిన నిజమైన, ప్రత్యేకమైన కానుక అని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు జన్ను కట్టయ్య, సీనియర్ నాయకులు సిరామ్‌శెట్టి సురేందర్, కొడాలి నాగేంద్రబాబు, జవాజి రాజు, కొడాలి సాయికిరణ్, కడారి అజయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు సుధాకర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు

## డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి




**హసన్‌పర్తి/ సెప్టెంబరు 2 (జర్నలిస్ట్ వార్త);**యువత డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కేయూ పోలీస్‌స్టేషన్ సీఐ రవికుమార్ సూచించారు. 'సే నో టు డ్రగ్స్ నినాదంతో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సే నో టు డ్రగ్స్ పోస్టర్‌ను సీఐ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం యువత ఆరోగ్యం, భవిష్యత్తును నాశనం చేస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజా సంఘాలు కలిసి యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. డ్రగ్స్ విక్రయాలు, వినియోగంపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. మత్తు పదార్థాల అక్రమ విక్రయాలు, సరఫరాపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు. యువత విద్య, క్రీడలు, సామాజిక సేవల వైపు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు రమణారెడ్డి, పల్లె ప్రవీణ్, తన్నీరు దుర్గా, గోపి, రమణ, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పాలనకు చెరగని సంతకం

### పేదల గుండెల్లో వైఎస్సార్ పేరు శాశ్వతం




**హసన్‌పర్తి/సెప్టెంబరు 2 (జర్నలిస్ట్ వార్త):**

పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగించిన మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని హసన్‌పర్తి 66వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొర్రె కిరణ్‌కుమార్ అన్నారు. వైఎస్సార్ 17వ వర్ధంతి సందర్భంగా బుధవారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. పేదలు, రైతులు, నిరుపేద కుటుంబాల అభ్యున్నతికి వైఎస్సార్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తుచేశారు. ప్రజల అవసరాలను తెలుసుకుని వారి జీవితాల్లో మార్పు తీసుకువచ్చేలా సంక్షేమ పాలనకు పెద్దపీట వేశారని తెలిపారు. వైఎస్సార్ అమలు చేసిన పథకాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నేటికీ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశాయన్నారు.ప్రజల కోసం ఆయన చేసిన సేవలు, ఆశయాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పేదల గుండెల్లో వైఎస్సార్ పేరు శాశ్వతంగా నిలిచిపోతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఎస్సీబీసీ, మైనారిటీ, మహిళా నాయకులు, బూత్‌స్థాయి కార్యకర్తలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి అవసరాలకు తుంగపాడు బంధం లిఫ్ట్ ద్వారా నీటి విడుదల

**దామరచర్ల/సెప్టెంబర్ 2 (జర్నలిస్ట్ వార్త):**



వీర్లపాలెం, అడవిదేవులపల్లి, ముదిమాణిక్యాల గ్రామాల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని వీర్లపాలెం తుంగపాడు బంధం లిఫ్ట్ ద్వారా నీటిని విడుదల చేశారు. ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ ఆదేశాల మేరకు లిఫ్ట్ చైర్మన్ అల్లం నాగరాజు, సామాజికవేత్త, కాంగ్రెస్ నాయకుడు కొంద లక్ష్మణ్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం నీటి విడుదల కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు లిఫ్ట్ ద్వారా నీటిని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లోనూ తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో గుంజ రామయ్య, పడిగపాటి సీతారాంరెడ్డి, గుంజ సైదులు, యాతం సైదులు, ఆంగోతు హుస్సేన్, బానోతు బాలు, పాత్తులోతు ఈశ్వర్, మూడవత్ హన్మ, ఆంగోతు రవి తదితరులు పాల్గొన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

# పేదల సంక్షేమ సారథి వైఎస్సార్

### వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నివాళి



**హసన్‌పర్తి/సెప్టెంబరు 2 (జర్నలిస్ట్ వార్త):**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నివాళులర్పించారు. బుధవారం హనుమకొండలోని డీసీసీ భవన్‌లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డితో కలిసి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పేదల సంక్షేమానికి పెద్దపీట వేశారని అన్నారు. ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, జలయజ్ఞం, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అనేక పథకాలను అమలు చేసి పేద, మధ్యతరగతి ప్రజలకు అండగా నిలిచారని గుర్తుచేశారు.బడికి వెళ్లే పిల్లల నుంచి పండు ముసలివారి వరకు అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిన మహనీయుడు వైఎస్సార్ అని కొనియాడారు. వైఎస్సార్ భౌతికంగా దూరమైనప్పటికీ ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రతి ఒక్కరి చిరునవ్వులో ఎప్పటికీ నిలిచి ఉంటారని అన్నారు. ప్రజల హృదయాలను గెలుచుకున్న మహానేతగా వైఎస్సార్ చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, జిల్లా సీనియర్ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌కు ఘన నివాళి



**దామరచర్ల/ సెప్టెంబరు 2 (జర్నలిస్ట్ వార్త);**దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా మిర్యాలగూడ నియోజకవర్గంలోని కొండ్రపోల్ గడ్డపై ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు స్కైలాబ్ నాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా స్కైలాబ్ నాయక్ మాట్లాడుతూ వైఎస్సార్ తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన మహానేత అని అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, 108 వంటి పథకాలను అమలు చేసి పేదల జీవితాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. వైఎస్సార్ ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో వైఎస్సార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగు నాయక్, రామలింగయ్య, మట్టరెడ్డి, గాయం ఉపేందర్‌రెడ్డి, అంజిరెడ్డి, సైదానాయక్, రవితేజ, గాజుల శ్రీను, బంటు కిరణ్, గాలం వెంకన్న, మండల నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు, యువజన నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## నిత్యావసర ధరలు తగ్గించాలి

**తల్లాడ/సెప్టెంబర్ 2 (జర్నలిస్ట్ వార్త):**



నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించి పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కల్పించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కమిటీ పిలుపు మేరకు బుధవారం తల్లాడ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో యూడీసీకి ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేసింది.ఈ సందర్భంగా పార్టీ తల్లాడఏన్కూరు సంయుక్త మండల కార్యదర్శి కే.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతూ సామాన్యులపై ఆర్థిక భారం మోపుతున్నాయన్నారు. నూనె, పప్పులు, ఉల్లిగడ్డలు, చక్కెర తదితర వస్తువుల ధరలు పెరగడంతో పేద, మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.వర్షాభావ పరిస్థితులు, పంటలు లేకపోవడం, ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో నిత్యావసర ధరల పెరుగుదల మరింత భారంగా మారిందన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు గొడ్ల పుల్లమ్మ, షేక్ జాన్మియా, వెంకటేశ్వర్లు, రాఘవ నారాయణ, యూసుఫ్, బిక్షం, విష్ణు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 4న బయ్యారంలో జరిగే వంటావార్పు విజయవంతం చెయ్యండి.

### -బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు.



**బయ్యారం/సెప్టెంబర్ 2(జర్నలిస్ట్ వార్త);**

బయ్యారం మండల బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తాత గణేష్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 4న బయ్యారం మండల కేంద్రంలో వంటా-వార్పు నిరసన కార్యక్రమానికి పార్టీ శ్రేణులు,నాయకులు ,కార్యకర్తలు, మహిళలు,వృద్ధులు, వికలాంగులు హాజరు అవ్వాలని బిఆర్ఎస్ పార్టీ పిలుపునిచ్చింది.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా, ఎన్నికల హామీల వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్ఎస్ పార్టీ సెప్టెంబర్ 2 నుండి 8 వరకు వారం రోజుల పాటు చేపట్టిన రాష్ట్రవ్యాప్త పోరుబాటలో భాగంగా బయ్యారం మండల కేంద్రంలో వంటా-వార్పు కార్యక్రమం చేపడుతున్నట్లు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తాత గణేష్ తెలిపారు.నిరసనలో భాగంగా మహిళలు,వికలాంగుల సమస్యలు,కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇస్తామన్న నెలకు ₹2,500 ఆర్థిక సాయం,మహాలక్ష్మి పథకం, కల్యాణలక్ష్మి /షాదీ ముబారక్‌తో పాటు తులం బంగారం వంటి హామీలను విస్మరించడం పట్ల బిఆర్ఎస్ శ్రేణులు,మహిళలతో కలిసి నిరసనలు చేపడుతున్నట్లు తెలిపారు.

## బాధ్యతలు చేపట్టిన సీఐ కొండ్ర శ్రీను



**ఎల్కతుర్తి/ సెప్టెంబరు 2 (జర్నలిస్ట్ వార్త):** ఎల్కతుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కొండ్ర శ్రీను బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.కాంగ్రెస్ నాయకులు శనిగరపు వెంకటేష్, డాక్టర్ బొల్లెపోగు రమేష్‌బాబు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎర్రోళ్ల సతీష్, ఎర్రోళ్ల జీవన్, ఎర్రోళ్ల రాజేష్ తదితరులు సీఐ కొండ్ర శ్రీనును కలిసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లో సీఐ పులి రమేష్ అందించిన సేవలు మరువలేనివని అన్నారు. ఆయన ఉద్యోగరీత్యా బదిలీ కావడం బాధాకరంగా ఉందని పేర్కొన్నారు. అదే సమయంలో కొండ్ర శ్రీను ఎల్కతుర్తి సీఐగా బాధ్యతలు చేపట్టడం సంతోషకరమన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఆకాంక్షించారు.ద

## అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు ఖండన

**ఎల్కతుర్తి/ సెప్టెంబరు 2 (జర్నలిస్ట్ వార్త);**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అంబేద్కర్ వారసుల సంఘం జిల్లా నాయకుడు సాతూరి రాజమౌళి, అంబేద్కర్‌వాది గొర్రె థామస్ మాట్లాడారు.అంబేద్కర్ ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత అని పేర్కొన్నారు. అటువంటి మహనీయుడిపై అవమానకరంగా మాట్లాడటం సరికాదన్నారు. దేశంలో ప్రజాస్వామ్య, లౌకిక విలువలను పరిరక్షించడంలో అంబేద్కర్ రచించిన రాజ్యాంగం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను గౌరవించే ప్రతి ఒక్కరూ అనుచిత వ్యాఖ్యలను ఖండించాలని కోరారు.

అంబేద్కర్‌పై వ్యాఖ్యల విషయంలో ప్రభుత్వం సమగ్రంగా విచారణ జరిపి, చట్ట ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు ఈ ఘటనను ఖండించాలని పిలుపునిచ్చారు.

## చిన్నారి చందన వేడుకలో వెంకన్న నాయక్



**కేసముద్రం/సెప్టెంబర్ 2 (జర్నలిస్ట్ వార్త);**

ధన్నసారి గ్రామానికి చెందిన నానబాల హేమలతఅనిల్‌యాదవ్ దంపతుల కుమార్తె చందన నూతన వస్త్రాలు, ఫల, పుష్పాలంకరణ వేడుక బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గ్రామ మాజీ ఉప సర్పంచ్ బానోత్ వెంకన్న నాయక్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారి చందనను ఆశీర్వదించారు.చిన్నారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు చిన్నారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కొండా సురేష్, నాయకులు కొండా పాపన్న, అజిత్‌రెడ్డి, బానోత్ మహేష్, పింగిలి ప్రసాద్, నారా అశోక్, మహేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించిన సీఐ రవీందర్.



**బయ్యారం/,సెప్టెంబర్ 2.(జర్నలిస్ట్ వార్త);**

బయ్యారం మండల కేంద్రంలోని వెంకట్రాంపురం క్రాస్ రోడ్డు వద్ద రాత్రి వేళల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.గార్ల బయ్యారం సీఐ రవీందర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేపట్టారు.రామచంద్రపురం వైపు వెళ్లే ప్రతి వాహనాన్ని ఆపి బ్రీత్ అనలైజర్ల ద్వారా వాహనదారులకు పరీక్షలు నిర్వహించారు.ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణాలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని,ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు.మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల మీ ప్రాణాలకే కాకుండా,రోడ్డుపై వెళ్లే ఇతర అమాయకుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని సీఐ హెచ్చరించారు.పరిమితికి మించిన వేగంతో ప్రయాణించవద్దని,ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పోలీసులు స్పష్టం చేశారు.నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని సీఐ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పాపారావు,ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# 48 గంటల్లో పంచాయతీ తీర్మానాలు

## ఎంపీడీవో హామీతో నిరసన విరమణ



**పోలాకి/సెప్టెంబరు 2 (జర్నలిస్ట్ వార్త):** పోలాకి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం ఉద్రిక్తంగా మారింది. జిల్లా పరిషత్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించి గ్రామ పంచాయతీల నుంచి తీర్మానాలు ఇవ్వకపోవడంపై జడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులను కావాలనే అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

**కార్యాలయానికి తాళం వేసేందుకు యత్నం**

తీర్మానాలు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ కృష్ణచైతన్య మండల పరిషత్ కార్యాలయానికి తాళం వేసేందుకు యత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం ఆయన కార్యకర్తలతో కలిసి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

**హామీతో సద్దుమణిగిన వివాదం:**

పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఇన్‌చార్జి ఎంపీడీవో బలగ ప్రకాష్ నిరసన స్థలానికి చేరుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పంచాయతీ తీర్మానాలను 48 గంటల్లో ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో కృష్ణచైతన్య నిరసన విరమించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ది పిరికిపందల రాజకీయాలు

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే చర్యలు: రాజేష్ ఠాకూర్

**జమ్మికుంట/ సెప్టెంబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ బీజేపీ భవన్ ఎదుట కాంగ్రెస్ నాయకులు వ్యవహరించిన తీరు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావును అరెస్టు చేయడాన్ని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజేష్ ఠాకూర్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమై, ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తల గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానికి ఉన్న హక్కులను కాలరాయడం, బీజేపీ నాయకులను అడ్డుకోవడం, అరెస్టులకు పాల్పడటం ప్రభుత్వ అసహన వైఖరికి నిదర్శనమన్నారు. రామచందర్‌రావును అరెస్టు చేసినంత మాత్రాన బీజేపీ గొంతును నొక్కలేరని స్పష్టం చేశారు. ఒక నాయకుడిని అరెస్టు చేస్తే వందలాది మంది కార్యకర్తలు ముందుకు వస్తారని పేర్కొన్నారు. నల్లగొండలో బీజేపీ నాయకులు, కార్యకర్తలపై జరిగిన ఘటనలపై న్యాయం కోసం పోరాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడిని అడ్డుకోవడం, అరెస్టు చేయడం ప్రభుత్వ నిరంకుశ ధోరణికి పరాకాష్ట అని విమర్శించారు. కాంగ్రెస్ బెదిరింపులు, అక్రమ అరెస్టులకు బీజేపీ భయపడే ప్రసక్తే లేదన్నారు. ప్రజా సమస్యలపై బీజేపీ నిరంతరం పోరాడుతుందని, ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలను ప్రజల ముందుకు తీసుకెళ్తామని రాజేష్ ఠాకూర్ తెలిపారు. అక్రమ కేసులు, అరెస్టులతో ఉద్యమాలను అడ్డుకోలేరని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో ప్రజలే తగిన సమాధానం చెబుతారని పేర్కొన్నారు.




# బయ్యారంలో ఘనంగా వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి.

**బయ్యారం/సెప్టెంబర్ 2.(జర్నలిస్ట్ వార్త);** బయ్యారం మండల కేంద్రంలో రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద బయ్యారం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాయకులు వైఎస్ఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పేదలకు పండ్లు పంపిన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా బయ్యారం సర్పంచ్ గుగులోత్ శాంతికిషన్ నాయక్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేలా ఆగిరెడ్డి, కంబాల ముసలయ్య మాట్లాడుతూ వైయస్ రాజశేఖర్ రెడ్డి మనకు దూరమై 17 ఏళ్ళు అయినప్పటికీ ఆయన ప్రతి పేదవాడి గుండెల్లో చిరస్థాయిగా నిలిచి



ఉన్నారని అన్నారు. ముఖ్యమంత్రిగా రాజశేఖర్ రెడ్డి అందించిన సేవలు మరువలేవని తెలిపారు. ముఖ్యంగా ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్ మెంట్, ఉచిత విద్యుత్, జలయజ్ఞం పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసిన మహనీయుడు వైయస్ రాజశేఖర్ రెడ్డి అని



కొనియాడారు. ఈ కార్యక్రమంలో యశోద, అజయ్, తగిర సత్యనారాయణరెడ్డి, జనార్ధన్, పంతులు నాయక్, కంకటి నారాయణ, చల్ల కృష్ణ, రెంటల ఇంద్రరెడ్డి, నందగిరి భద్రయ్య, సూర్యనారాయణ, నద్దునూరి లింగయ్య, ప్రమోద్ రెడ్డి, నందిపాటి బావాణి, బీరెడ్డి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# 22ఏ, రీ సర్వేలను పరిశీలించిన కలెక్టర్ స్నేహ శబరీష్

**మహబూబాబాద్ / సెప్టెంబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో రీ సర్వేకు ఎంపికైన 70 గ్రామాల్లో సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. బుధవారం తొర్రూరు మండలంలో పర్యటించిన ఆమె.. జమిస్తాన్‌పురం, కానాపురం, వెంకటాపురం, కర్కాల, గోపాలగిరి, మడిపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న రీ సర్వే పనులను పరిశీలించారు. జమిస్తాన్‌పురంలో జరుగుతున్న సర్వేను కలెక్టర్ స్వయంగా పరిశీలించి అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. ఇప్పటివరకు గ్రామంలో 190 ఎకరాల పట్టా భూములను సర్వే చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. జులై 10 నుంచి సర్వే కొనసాగుతున్నందున నిర్దేశిత లక్ష్యాన్ని



నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. అనంతరం తొర్రూరు తహసీల్దార్ కార్యాలయంలో 22ఏ నిషేధిత జాబితాపై కలెక్టర్ సమీక్షించారు. జాబితాలో ఉన్న వ్యవసాయేతర భూములను క్షేత్రస్థాయిలో సక్రమంగా గుర్తించాలని ఆదేశించారు. భూ సమస్యలకు సంబంధించి రికార్డుల్లో ఉన్న వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, విద్యుత్ సబ్‌స్టేషన్లు తదితర ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తున్న భూములపై ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టాలని చెప్పారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు 22ఏ నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని, భూ సమస్యల పరిష్కారంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ సేవలు అందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

కలెక్టర్ వెంట రెవెన్యూ డివిజనల్ అధికారి గణేష్, ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వైఫల్యాలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసన జ్వాలలు

**తల్లాడ/సెప్టెంబరు 2 (జర్నలిస్ట్ వార్త):** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం తల్లాడ మండల కేంద్రంలో మహా ర్యాలీ, ధర్నా నిర్వహించారు. సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను



అవలంబిస్తోందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో రైతులకు ఎరువుల కోసం గంటల తరబడి క్యూలో నిలబడే పరిస్థితి లేదన్నారు. ప్రస్తుతం యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్మార్ట్‌ఫోన్లు లేని పేద రైతులకు అవగాహన కల్పించకుండా యాప్‌లను ప్రవేశపెట్టి ఎరువుల పంపిణీలో గందరగోళం సృష్టిస్తున్నారని ఆరోపించారు.

ఆరు గ్యారెంటీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని, ఎన్నికల హామీలు ప్రచారానికే పరిమితమయ్యాయని విమర్శించారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుండా ప్రతిపక్షాలపై ఆరోపణలు చేయడం మానుకుని పాలనపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సూచించారు. కార్యక్రమంలో పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, రైతు విభాగం ప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

# పట్టాదారులందరికీ పీఎం కిసాన్ వర్తింపజేయాలి



**కేసముద్రం/సెప్టెంబరు 2 (జర్నలిస్ట్ వార్త):** భూమి పట్టా కలిగిన అర్హులైన రైతులందరికీ పీఎం కిసాన్ పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ ఎంసీపీఐ(యు), ఏఐసీటీయూ ఆధ్వర్యంలో బుధవారం కేసముద్రం అంబేద్కర్ సెంటర్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎంసీపీఐ(యు) మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న మాట్లాడుతూ 2019 ఫిబ్రవరి 1 వరకు పట్టా పొందిన రైతులకు మాత్రమే పీఎం కిసాన్ నిధులు అందుతున్నాయని ఆరోపించారు. 2019 ఫిబ్రవరి 2 నుంచి 2026 వరకు భూమి పట్టాలు పొందిన అర్హులైన రైతులందరినీ పీఎం కిసాన్ పథకంలో చేర్చి ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు చెందిన బీజేపీ కేంద్ర మంత్రులు, ఎంపీలు ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అర్హులైన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్య పరిష్కరించకపోతే రైతుల హక్కుల సాధన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ(యు) జిల్లా కమిటీ సభ్యులు బొల్లోజు రామ్మోహనాచారి, ఏఐసీటీయూ నాయకులు ఎండి హబీబ్, మాచర్ల వెంకన్న, ఎడ్ల సంధ్య, పయ్యావుల కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సేవలు మరువలేనివి



**ఎల్కతుర్తి/సెప్టెంబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సేవలు చిరస్మరణీయమని గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శీలం అనిల్‌కుమార్ అన్నారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు బుధవారం అంబేద్కర్ జంక్షన్‌లో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి వైఎస్సార్ చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో చెరగని ముద్ర వేశాయని పేర్కొన్నారు. వైఎస్సార్ ఆశయాలు, ప్రజా సంక్షేమ స్ఫూర్తిని కొనసాగిస్తూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ గోడిశాల రాజయ్య, మాజీ సర్పంచులు గోడిశాల యాదగిరి, కొమ్మిడి రాజిరెడ్డి, జనగాని లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు డాక్టర్ రమేశ్, పాక రమేశ్, శ్రీపతి సదానందం, యువ నాయకులు గోడిశాల అర్జున్, గుడేల్లి నవీన్, అంచనగిరి వెంకట్‌తో పాటు నాయకులు, ప్రజాప్రతినిధులు, కమిటీ సభ్యులు, మహిళా కాంగ్రెస్, అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు




**తల్లాడ/సెప్టెంబరు 2 (జర్నలిస్ట్ వార్త):** జనసేన పార్టీ అధినేత, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను తల్లాడ మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేసి, దాని ఎదుట కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జనసేన నాయకులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని జై జనసేన. వర్ధిల్లాలి పవన్ కల్యాణ్ నాయకత్వం అంటూ నినాదాలు చేశారు. పవన్ కల్యాణ్ ఆశయాల సాధనకు, ప్రజా సేవకు నిరంతరం కృషి చేస్తామని పార్టీ శ్రేణులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పులి రాజేష్, దుగ్గి దేవర కళ్యాణ్, ఉయ్యూరు పవన్, హరి, మండల జనసేన నాయకులు, యువత, అభిమానులు పాల్గొన్నారు.

# 5.23 లక్షల మందికి కంటి వెలుగు

## శంకర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

**విశాఖపట్నం/ సెప్టెంబరు 2 (జర్నలిస్ట్ వార్త):** నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆత్మకూరి శంకర్‌రావు 95వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ ట్రస్టీ చైర్మన్ రామదాస్ మాట్లాడుతూ 1984లో చిన్నచిన్న సేవా కార్యక్రమాలతో ప్రారంభమైన సంస్థ 1997లో కంటి ఆసుపత్రిని ఏర్పాటు చేసి విశేష సేవలు అందిస్తోందన్నారు. ఇప్పటి వరకు 5.23 లక్షల కంటి శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. మయోపియా, ట్రోపియా, కార్నియా, గ్లకోమా తదితర కంటి వ్యాధులకు వైద్య సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. దాతలు, సేవాభావం కలిగిన వారి సహకారంతో సంస్థ సేవలను విస్తరిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమానికి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాల నుంచి పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ఉత్తమ సేవలు అందించిన పలువురిని ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.



# హుజూరాబాద్‌లో ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు



**హుజూరాబాద్/ సెప్టెంబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను హుజూరాబాద్ నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. జమ్మికుంట మండల కేంద్రంలోని స్థానిక వృద్ధాశ్రమం, దివ్యాంగుల ఆశ్రమంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వృద్ధులు, దివ్యాంగుల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులు, దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేశారు. పవన్ కల్యాణ్ ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని నాయకులు ఆకాంక్షించారు. పేదలు, వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమానికి జనసేన పార్టీ తరపున తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. సేవా కార్యక్రమాలతో జన్మదిన వేడుకలు నిర్వహించడం ద్వారా సమాజానికి మంచి సందేశం ఇచ్చామని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ నాయకులు భైరగోని అరవింద్ గౌడ్, ఎలుకపెల్లి శివ, పారాందుల క్రాంతి, జంపాల పవన్, దాసారపు చిరంజీవి, పవన్ సాయి, అయోధ్య, రాజనర్సింహ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ కాలనీ అభివృద్ధికి సీసీ రోడ్లతో బాటలు

### త్వరలో సెంటర్ లైటింగ్.. ప్రధాన రోడ్డుకు డ్రైనేజీ కాలువలు సర్పంచ్ బిల్లా యాదగిరి



**వేలేరు/సెప్టెంబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** వేలేరు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ అభివృద్ధికి గ్రామపంచాయతీ పాలకవర్గం శ్రీకారం చుట్టింది. గ్రామపంచాయతీ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి ప్రారంభించారు. దీంతో ఏళ్లుగా రోడ్ల సమస్యతో ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులకు ఊరట లభించనుంది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రాధాన్యత క్రమంలో పనులు చేపడుతున్నామని తెలిపారు. ఎస్సీ కాలనీలో సీసీ రోడ్ల పనులను పూర్తి చేయడంతో పాటు గ్రామంలో మిగిలిన వీధుల్లోనూ దశలవారీగా రోడ్ల నిర్మాణం చేపడతామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో త్వరలో గ్రామంలో సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని, ప్రధాన రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువలు నిర్మిస్తామని తెలిపారు. గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో ఎలాంటి రాజీ ఉండదని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, ఉపసర్పంచ్ శ్రీకర్, పంచాయతీ కార్యదర్శి విజయ, వార్డు సభ్యులు ప్రశాంత్, చైతన్య, సునీల్, కాంగ్రెస్ నాయకులు రాజేందర్, గ్రామ పెద్దలు రాజయ్య, రాజు, మల్లయ్య, చంద్ర మొగిలి, కర్ణాకర్, కాసిం, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల పంపిణీలో ఇక ఎఫ్ఎఫ్ఎస్

### రైతులు యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి: ఏవో రాజేష్



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరోసెప్టెంబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** రైతులకు రసాయన ఎరువులను పారదర్శకంగా, అవసరానికి అనుగుణంగా అందించేందుకు ఇకపై ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ (ఎఫ్ఎఫ్ఎస్) యాప్ ద్వారా పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి రాజేష్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ డిజిటల్ విధానం ద్వారా ఎరువుల పంపిణీలో పారదర్శకత పెరగడంతోపాటు రైతులకు సులభంగా ఎరువులు అందే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

రైతులు గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఎరువుల పంపిణీ ప్రక్రియలో రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా, సందేహాలున్నా ఆయా గ్రామాల ఏఈవోలు, ఎరువుల విక్రయ కేంద్రాలను సంప్రదించాలని రాజేష్ కోరారు. ఎరువుల కొరత, అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయించే పరిస్థితులకు తావులేకుండా పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.

# చోరీ కేసులో ఇద్దరు యువకుల అరెస్టు

### రెండు బైక్‌లు, నగదు స్వాధీనం




**గీసుగొండ/ సెప్టెంబరు 2 (జర్నలిస్ట్ వార్త):** మచ్చాపూర్ శివారులోని సిమెంట్ బ్రిక్స్ పరిశ్రమలో చోరీకి పాల్పడిన ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు గీసుగొండ సీఐ డి. విశ్వేశ్వర్ తెలిపారు. వారి నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, రూ. 1,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

కాశిబుగ్గకు చెందిన సముద్రాల సురేష్ నిర్వహిస్తున్న లక్ష్మీ గణపతి సిమెంట్ బ్రిక్స్ పరిశ్రమలో ఆగస్టు 29న గుర్తుతెలియని వ్యక్తులు గది తాళం పగులగొట్టి రూ. 10 వేల నగదు అపహరించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం ఊకల్ క్రాస్‌రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన మహమ్మద్ సమీర్ (18), మహమ్మద్ అజీమ్ (19)లను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. విచారణలో మిల్స్ కాలనీ, దుగ్గొండి పోలీస్‌స్టేషన్ పరిధుల్లో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడినట్లు వెల్లడైందని సీఐ తెలిపారు. నిందితుల నుంచి హోండా షైన్ (TS`03`EL`8461), హోండా యాక్టివా (TS`03`EA`4537), రూ. 1,000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు సీఐ విశ్వేశ్వర్ వెల్లడించారు.

# ప్రజా ప్రభుత్వానికి వెయ్యి రోజులు



**తల్లాడ/ సెప్టెంబరు 2 (జర్నలిస్ట్ వార్త):** ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా తల్లాడ ప్రభుత్వ హాస్టల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం వేడుకలు నిర్వహించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో మౌలిక వసతులు మెరుగుపరచడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు చేపడుతోందన్నారు. ఉచిత విద్యతో పాటు అల్పాహారం, బ్యాగులు, యూనిఫాంలు, షూలు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేలా నర్సరీ నుంచి 12వ తరగతి వరకు సమగ్ర విద్యా విధానం, నైపుణ్య ఆధారిత బోధనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోవింద్ శ్రీనివాసరావు, దుండేటి వీరారెడ్డి, జక్కంపూడి కిషోర్, పొట్రూ శరత్, తాళ్ల జోసెఫ్, వెంకటనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, హరీష్‌రెడ్డి, బసవయ్య, హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ 17వ వర్ధంతి వేడుకలు ఘనంగా



**హుజురాబాద్/ సెప్టెంబరు 2: (జర్నలిస్ట్ వార్త);** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 17వ వర్ధంతి వేడుకలను హుజురాబాద్ పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్‌రావు పాల్గొని వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన ప్రజానాయకుడని కొనియాడారు. పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థుల సంక్షేమం కోసం ఆయన అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. ప్రజల కోసం నిరంతరం పనిచేసిన వైఎస్సార్ ఆశయాలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం నాయకులు, కార్యకర్తల సమక్షంలో పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మండల అధ్యక్షురాలు, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు, హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సామాజిక మాధ్యమాల ఇన్‌చార్జి, యువజన కాంగ్రెస్, మహిళా నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పేదల గుండెల్లో వైఎస్సార్.. చెరగని ముద్ర!




**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరోసెప్టెంబరు 2 (జర్నలిస్ట్ వార్త):** పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటుపడిన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. వైఎస్సార్ 17వ వర్ధంతి సందర్భంగా ధర్మసాగర్ మండలం ఎల్కుర్తి గ్రామంలో కాంగ్రెస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన ప్రజా సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను నాయకులు స్మరించుకున్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్సార్ పేదలు, రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని పేర్కొన్నారు. ఆయన సేవలు, సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో చెరగని ముద్ర వేశాయని అన్నారు. వైఎస్సార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ నరిశెట్టి సుధాకర్, ఉప సర్పంచ్ కొలిపాక రమేష్, మాజీ సర్పంచ్ అరుణ యాదగిరి, కాంగ్రెస్ గ్రామ కమిటీ సభ్యులు వస్కుల రమేష్, గాజుల సదానందం, మాజీ సింగిల్‌విండో చైర్మన్ ఇంద ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు



# అసమానతలకు ముగింపు పలకాలి

### చలో అమరావతికి తరలిరండి. ఎమ్మార్పీఎస్ జాతీయ మహాసభను విజయవంతం చేయాలి -మహేందర్ మాదిగ







**మోత్కూర్/సెప్టెంబరు 2(జర్నలిస్ట్ వార్త):** సమాజంలో అసమానతలను రూపుమాపి సమానత్వాన్ని సాధించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని దళిత రత్న అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు, యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్‌చార్జి బిర్రు మహేందర్ మాదిగ అన్నారు.

అక్టోబర్ 7న నిర్వహించనున్న చలో అమరావతి ఎమ్మార్పీఎస్ జాతీయ మహాసభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, అవకాశాలు దక్కేలా ఉద్యమాన్ని బలోపేతం చేయాలని కోరారు. అసమానతలు లేని సమాజం కోసం మనమంతా ఒక్కటై ముందుకు సాగాలి. సామాజిక న్యాయం కోసం జరిగే ఈ మహాసభకు ప్రతి ఒక్కరూ తరలిరావాలి అని మహేందర్ మాదిగ అన్నారు.